క్లుప్తంగా

ఈ నెలాఖరు వరకు ఇంటర్ ప్రవేశాలు


సుజాత, ప్రిన్సిపాల్

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నట్టు ప్రిన్సిపాల్ ఎ.ఆర్.టి.సుజాత తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ఇప్పటి వరకు 47 మంది విద్యార్థులు చేరినట్టు తెలిపారు. ఆహ్లాద వాతావరణంలో బోధన ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు చేరాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరా


సీసీ కెమెరా ఏర్పాటు చేయించిన ఎస్ఐ రమేష్

కోటవురట్ల: అసాంఘిక కార్యకలాపాల కట్టడికి సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. చినబొడ్డేపల్లి, ఆక్సాహేబుపేట, పి.కె.పల్లి గ్రామాల కూడలిలో శుక్రవారం సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ దాట్ల రామభద్రరాజు, పెద్ద సూరెడ్డి సత్యనారాయణల సహకారంతో నేరాల నిరోధానికి దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇదే విధంగా మండలంలోని పలు కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం


అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని వెంకటాపురంలో రామాలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ సుందరపు తాతాజీ. వీఆర్‌వోల సంఘ రాష్ట్ర నాయకుడు బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పాల సంఘ అధ్యక్షుడు సుందరపు వెంకట కాసులుబాబు, ఆడారి కాశీ, మాధవవర్మ, రామకృష్ణ, నూకరాజు, శ్రీనివాసరావు, సురేష్ తదితరులు సీతారాములను దర్శించుకొని పూజలు చేశారు.

దేవీతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న నారాయణరావు, దేవి దంపతులు

మునగపాక: ప్రతి ఒక్కరూ దేవీతల్లి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు కోరారు. మండలంలోని ఉమ్మలాడలో నిర్మిస్తున్న దేవీతల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు తమవంతు సాయం అందిస్తున్నారు. దీనిలో భాగంగా విజయనగరం జిల్లా జామి మండలం విజినిగిరి గ్రామానికి చెందిన కిలారి నారాయణరావు, దేవి దంపతులు శుక్రవారం ఆలయ నిర్మాణానికిగాను రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల్లో యోగాంధ్ర

మునగపాక: ప్రతి సచివాలయంలో శనివారం యోగాంధ్ర నిర్వహించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ముందస్తుగా ప్రతీ సచివాలయ ప్రాంగణంలో యోగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


యోగాంధ్రలో వివిధ పోటీల విజేతలు

కోటవురట్ల: గ్రామీణ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. యోగాంధ్రలో భాగంగా వివిధ పోటీలు నిర్వహించగా, జిల్లా స్థాయిలో కోటవురట్ల మండలానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. కొడవటిపూడి శ్రీచాణక్య స్కూల్‌కు చెందిన డి.ప్రియాంక క్విజ్ పోటీలో, యోగాంధ్ర స్కిట్‌లో బి.చాందిని, డి.ప్రియాంక, ఐ.జ్యోతి కారాణి, ఎస్.హారిక, ఎం.అపూర్వ, వ్యాసరచనలో జెడ్పీ హైస్కూల్, కొడవటిపూడికి చెందిన కె.రామలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

దాళ్వా.. దళారులకేనా!

- కొనుగోలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- తడిసి ముద్దవుతున్న రబీ ధాన్యం
- రైతుల అవస్థలు


వాడ్రాపల్లిలో ధాన్యం నిలువ చేసిన ప్రదేశం


కొనుగోలుకు నోచుకోని ధాన్యం బస్తాలు

మునగపాక: ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రబీలో దాళ్వా వరి సాగు చేసిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదు. దాంతో దళారులు తక్కువ ధరకు ధర నిర్ణయించడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా నిలిచారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దాళ్వా వరి రైతుల కష్టాలు తీరవా..?

రబీలో దాళ్వా వరి సాగు చేసిన రైతుల కష్టాలు నేటికీ తీరకుండా పోయాయి. వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, మల్లవరం తదితర గ్రామాల రైతులు దాళ్వా వరి సాగు చేపట్టారు. సుమారు 620 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికి అందివచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. చేతికి అందివచ్చిన పంటను కష్టపడి సమకూర్చుకున్నా, ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో ధాన్యం అమ్మకం కాకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో దళారులు నిర్ణయించిన ధరకు ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు సమ్మతించడం లేదు.

జగన్ హయాంలో క్వింటాల్‌కు రూ.2,225

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరికి క్వింటాల్‌కు రూ.2,225 వంతున రైతుకు మద్దతు ధర అందేది. దీంతో పండిన పంటను అమ్ముకోవడం ద్వారా ఆశించిన ఆదాయం సమకూరేది. నేడు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులు క్వింటాల్‌కు రూ.1,700 అడుగుతుండడంతో రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రబీలో పండిన దాళ్వా వరిని బస్తాలతో రైతులు గోదాముల్లో దాచుకోవాల్సి వస్తుంది. దీంతో గింజ దెబ్బతింటుందని వాపోతున్నారు.

గాలికొదిలేసిన ఎన్నికల హామీ..

కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు గాలికొదిలేసిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంటలకు మెరుగైన గిట్టుబాటు ధరలు అందుబాటులోకి తీసుకువస్తామంటూ ప్రచారం చేసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి రైతులకు అండగా ఉంటామంటూ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ అమలు చేస్తామంటూ వాగ్దానం చేశారు. ప్రతీ రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద రూ.13,500 అందించి రైతు పక్షపాతిగా సేవలందించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వమే ఆదుకోవాలి



సీజన్‌తో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యం సేకరించి కొనుగోలు చేస్తామంటూ ఇచ్చిన హామీ అమలవ్వలేదు. దాళ్వా వరి రైతులు ధాన్యం అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సరైన గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో దళారులు ఎక్కువైె తక్కువ ధరకు ధాన్యం అడుగుతున్నారు. ప్రభుత్వం దాళ్వా రైతును ఆదుకోవాలి.

– మళ్ల జోగినాయుడు, రైతు, వాడ్రాపల్లి

లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు



రబీలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాం. అయితే లక్ష్యానికి మించి ధాన్యం పండించడంతో కొనుగోలు కష్టతరంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకున్నాం. అయితే దాళ్వా వరి సాగు చేసే రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాం. సకాలంలో రైతుల నుంచి స్పందన కరువైంది.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏవో, మునగపాక

పాయకరావుపేట ఈవోపీఆర్డీగా డేవిడ్



పాయకరావుపేట: మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా(ఈవోపీఆర్డీ) కె.డేవిడ్ నియమితులయ్యారు. జి.మాడుగుల మండలంలో పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు.

ఈవోగా లోవరాజు



స్థానిక మేజరు పంచాయతీ ఈవోగా ఎం.వి.ఎస్. లోవరాజు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో జయప్రకాష్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు.

మాజీ ఎమ్మెల్యే జోగులు పరామర్శ


నాగరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

ఎస్.రాయవరం: అనారోగ్యంతో బాధపడుతున్న చోడిపల్లి నాగరాజు త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆకాంక్షించారు. గుండె శస్త్రచికిత్స చేయించుకుని రేవుపోలవరం స్వగృహం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నాగరాజును పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తల్లికి వందనం నిధుల్లో కోత దారుణం

రూ.15 వేలు తల్లులకు జమ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్


యలమంచిలిలో నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద తల్లికి వందనం నిధుల్లో రూ.2 వేలు కోత పెట్టడాన్ని శుక్రవారం వారు ఆక్షేపించి, నిరసన తెలియజేశారు. ప్రభుత్వం నిబంధనల పేరుతో కొందరికి పథకాన్ని వర్తింపజేయకపోవడం దురదృష్టకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ అభిప్రాయపడ్డారు. 2024–25 విద్యా సంవత్సరానికి చెల్లించాల్సిన తల్లికి వందనం నిధులు వెంటనే తల్లుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆ నిధులను జమ చేయకుండా ఎగ్గొట్టడానికే ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నిబంధనల పేరుతో పలువురికి తల్లికి వందనం దూరం చేసే ఆలోచన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కే మణికంఠ, రూపసాయి, దినేష్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తల్లి పండగ


దుర్గాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో దుర్గాలమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని రాత్రి పలువురు భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, సరిసా శ్రీనివాసరావు, సన్నిబాబు, సంజయ్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదేరోజు రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ర్యాలీ


మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు కోరారు. మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో శుక్రవారం మునగపాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్ల మోజులో పడి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో సేవలందిస్తారన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేలా చూడాలన్నారు. మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధి శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు విత్తనమే కీలకం


రైతులకు అధిక దిగుబడి విత్తనం అందజేస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: ప్రతి పంటలోను అధిక దిగుబడులు సాధనకు నాణ్యమైన విత్తనమే కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్. ముకుందరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఖరీఫ్ విత్తన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనం ప్రాముఖ్యత, అధిక దిగుబడులునిచ్చే విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలని కోరారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాత విత్తనాల మార్పిడి చేయడంలో తీసుకోవలసిన మెలకువలు ఆర్.జి.ఎల్ –2538 రకానికి ప్రత్యామ్నాయ రకాలు, జిల్లాలో వరి పండించే పరిస్థితులకు అనువైన నూతన వంగడాల గురించి వివరించారు. డాక్టర్ పి.వి. పద్మావతి విత్తన ఉత్పత్తి మెలకువలను వివరించారు. డాక్టర్ కె.వి రమణమూర్తి వరి సాగులో ఆధునిక పద్ధతులు, కలుపు యాజమాన్యం పద్ధతులను వివరించారు. డాక్టర్ సి.హెచ్ రామలక్ష్మి జీవన ఎరువుల ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. డాక్టర్ బి. భవాని మాట్లాడుతూ వరి సాగులో చేపట్టవలసిన ముందస్తు సస్యరక్షణ చర్యలను వివరించారు. సమన్వయకర్తగా డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. మూలపేట, వాడ్రాపల్లి, హరిపాలెం తిమ్మరాజుపేట, తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాల నుంచి 40 మంది రైతులు హాజరయ్యారు.

వైభవంగా రాజలింగేశ్వరస్వామి కల్యాణం


స్వామి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కోటవురట్ల: రాజుపేటలో రాజరాజేశ్వరి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి కల్యాణాన్ని కమనీయంగా వీక్షించారు. వీరికి ఇబ్బంది కలగకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొనాలి


రేవుపోలవరం యోగా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు


వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో ఈ నెల 15న 1500 మందితో నిర్వహించే యోగా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఇక్కడ తీరంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి తరలివచ్చి యోగాలో పాల్గొనాలన్నారు. వాహనాల పార్కింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు తదితర సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు రామకృష్ణ, అబద్దం, అడవిరాజు పాల్గొన్నారు.

నేడు అన్ని గ్రామాల్లో యోగా

నక్కపల్లి: యోగాంధ్రలో భాగంగా శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రొటోకాల్ యోగాసనాలు నిర్వహించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ప్రొటోకాల్ ఆసనాలపై శిక్షణ పొందిన వారందరితో ఆయా గ్రామాల్లో ఉదయం ఏకకాలంలో డెమో ఇవ్వాలని సూచించారు. వెంటనే ఈ ఫొటోలను యోగాంధ్ర యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహారం


అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి


అచ్చెర్ల కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు ధ్రువపత్రాలు అందజేత

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

కశింకోట: అంగన్‌వాడీ పిల్లలకు పోషక విలువలు కలిగిన భోజనాన్ని రుచికరంగా అందించడానికి కార్యకర్తల చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని చింతలపాలెం, నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, అచ్చెర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలతో మమేకమయ్యారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. భోజనానికి ముందు పిల్లలకు చేతులను శుభ్రం చేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేళ్ల పిల్లలను ప్రీ స్కూల్‌కు పంపి ప్రవేశాలు కల్పించాలన్నారు.. ప్రీ స్కూల్లో ఆట పాటలతో నర్సరీ కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన చేయాలని కార్యకర్తలకు సూచించారు. పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లిదండ్రులు పంపించాలన్నారు. పౌష్టిక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తారన్నారు. టీడీ ఇంజక్షన్లు వేయించుకోవాలన్నారు. అచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రీ స్కూలులో చేరడానికి తల్లులతో ధ్రువ పత్రాలను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వంశీ ప్రియ, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్,అధ్యాపకులు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందజేస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం విజయ్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఐఐటీ, నీట్, ఈఏపీసెట్ శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను శుక్రవారం ఆయన ఉచితంగా అందజేశారు. విద్యార్థులంతా ప్రైవేటు కళాశాలలకు దీటుగా జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. అంతకుముందు యోగాంధ్ర సాధన కార్యక్రమాన్ని పరిశీలించారు. చక్రధర్, భాగ్యమతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను సర్పంచ్ ఫాతిమునీషా బేగం, హెచ్ఎం కె.జయశ్రీ పంపిణీ చేశారు. సర్పంచ్ ఫాతిమునీషా బేగం మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు చదువులో వెనుకబడిన వారి పట్ల ఉపాధ్యాయులు చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. గతేడాది పదో తరగతిలో సాధించిన ఫలితాలే దీనికి నిదర్శనమన్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బషీర్, బి.లక్ష్మణ్‌రావు, ఇమామ్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీలు


ఎమ్మార్పీఎస్ సమావేశంలో యలకా మల్లిబాబు

అనకాపల్లి: త్వరలో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని జిల్లా అధ్యక్షుడు యలకా మల్లిబాబు తెలిపారు. స్థానిక శ్రీరామ్‌నగర్ ఎమ్మార్పీస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా పోరాటం చేయడం వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. విద్యతోనే మానవుని భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. ఎంఎస్పీ ఇన్‌చార్జి వెంకటరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరి మంగరాజా, సభ్యులు పాల్గొన్నారు.

17 నుంచి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయ 8వ వార్షికోత్సవం ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ తెలిపారు. స్థానిక అమ్మవారి ఆలయం వద్ద వార్షికోత్సవ పోస్టర్‌ను శుక్రవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులతో 17న అమ్మవారి పెళ్లిరాట, 18 హోమం, గోపూజ, 19న దుర్గా మల్లేశ్వర స్వామివారి కళ్యాణం నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కొణతాల మురళీకృష్ణ, కొణతాల తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై విచారణ జరపాలి



ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో గురువారం జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సాల్వెంట్ వద్ద ఇండికేటర్‌ను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పరిశ్రమల్లో హెల్త్‌కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో భద్రత ఆడిట్‌ను నిర్వహించాలని, ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు గుమ్మాల సింహాచలం, ప్రసాద్, లోవరాజ, శ్రీను, రమణ పాల్గొన్నారు.